## కథ

# శ్రామిక

**పి. రాజ్యలక్ష్మి**

నవజీవన్ ఈ రోజు చీరాలకు చాలా ముందుగా వచ్చింది. రోజూ చాలా ఆలస్యంగా వచ్చే బండి ఈరోజు ముందుగా అంటే కరెక్టు టైముకు వచ్చింది. ఈరోజు లేడీస్ కంపార్టుమెంటు హడావిడిగా లేదు. ఏమయినారు జనాలు. చీరాల వచ్చిందంటేచాలు పూలు అమ్ముకునే వాళ్ళు కంపార్టుమెంట్ అంతా ఉంటారు.

బండి ఎక్కానేగాని సందడి లేదు. రోజూ వచ్చే పూలమ్మలు ఎందుకు రాలేదబ్బా, ఏమై ఉంటుంది. అసలే ఈరోజు శ్రావణ శుక్రవారం, ఎక్కువ పూలు తీసుకొని వస్తారు, రోజూ ఒంగోలు దాకా ప్రయాణం చేసినా ఎప్పుడు విసుగు అనిపించేది కాదు, వాళ్లందరు లేకపోవటాన బండి చాలా బాధగా, దీనంగా ఉన్నట్లుంది. ఏమై ఉంటుంది, ఒక్కరన్నా రాలేదు. అందరూ పని గట్టుకొని రాలేదంటే ఏమన్నా సమ్మె చేస్తున్నారా! ఛ అంత సీను ఎక్కడుంది.

పొద్దున లేస్తే ఏమి తింటారో, ఏమి చేస్తారో వాళ్ళకే తెలియదు. అయినా వాళ్ళకు ఏమి హక్కుల కోసం సమ్మె చేయాలి. అసలు హక్కులు అంటూ ఉంటే కదా! అసలు ముందుగా మనుషులు అయితే కదా! ఇవన్నీ ఆలోచించటానికి, వాళ్ళు మాత్రం ఒక యంత్రం లాంటివారు. ఇంధనం ఉన్నంతవరకు యంత్రం స్విచ్ వేస్తే పని చేసుకుపోతుందా, వీళ్ళు అంతే, పెద్దగా తేడా లేదు.

ఒంగోలులో దిగి ఆఫీసుకు పోయి కూర్చున్నా వాళ్ళమీదే ధ్యాస ఉంది. ఎప్పుడు అందరూ ఇలా రాకుండా జరగలేదు.

ఎందుకని వాళ్ళు రాలేదు అన్న అనుమానం వెంటాడుతూనే ఉంది. పని చేయబుద్ధి కాలేదు. అనుకోకుండా వాళ్ళతో తెలియని అనుబంధం ఏర్పడింది. ఏ అనుబంధమో తెలియదు. ఒక్కరోజు వాళ్ళు కనపడకపోతే మనసు విలవిల్లాడి పోతుంది. సాయంత్రం చీరాలకు పోయి విషయం కనుక్కున్నదాకా మనస్సు స్థిమితపడదు. ఆఫీసులో పనిచేస్తున్నా ఎందుకనో వాళ్ళ గురించి ఆలోచించడం మొదలు అయింది.

ఆఫీసు నుండి బయలుదేరి స్టేషనుకు వచ్చి ప్లాట్‌ఫారం అంతా వెతికాను. కాని ఎవ్వరు కనిపించలేదు. రైలుబండి ఎక్కాను గాని వాళ్ళ గురించే ఆలోచన, వాళ్ళను గురించి ఆలోచిస్తుంటే చాలా బాధగా వుంది.

ఏదో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాము కాబట్టి నాలుగు వేళ్ళు నోట్లోకి పోతున్నాయి. అదే వాళ్ళ బ్రతుకులు ఎంత దుర్భరం. తెల్లవారు ఝామున లేచి ముఖం కడుక్కోకుండా తోటలకు పోయి పూలు కోసుకుంటారు. వెంటనే ఇంటికి వచ్చి వంటా వార్పు చేసుకొని క్యారేజీలు పెట్టుకొని పూలమూటలు నెత్తిన పెట్టుకొని నవజీవన్ బండి ఎక్కుతారు. బండి ఎక్కడం ఆలస్యం వాళ్ళకు సీటు ఉన్నదా, సీట్లో కూర్చోవాలన్న ధ్యాస ఉండదు. గబగబా తలా ఒక గోనెసంచి పరచుకొని సీట్లు ఖాళీగా వున్నా క్రింద చతికిలపడతారు.

వాళ్ళు స్థిమితంగా కూర్చున్నంతసేపు ఒకటే హడావిడి. గల గల మాటలు, ఒకరిని ఒకరు తిట్టుకోవటం, పరాచకాలాడటంతో సరిపోతుంది. పావుగంటకు కాని వాతావరణం స్థిమితపడదు. ఇక అప్పుడు అందరూ ఒకచోట కూడతారు.

కడుపులోని ఆకలి అప్పుడు బయటకు వస్తుంది. అప్పటిదాకా వాళ్ళకి ఒక పొట్ట ఉంది, దానికి కొంత మేత వేయాలన్న ధ్యాస ఉండదు. స్థిమితంగా అన్ని క్యారేజీలు మూతలు తెరుచు కుంటాయి. ఎవరి క్యారేజి చూసిన పచ్చడి తప్పితే వేరే కూర కనబడదు. అయినా చాలా సంతోషంగా, ఆప్యాయంగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ తినడం మొదలు పెడతారు.

వాళ్ళలో ఎవరయినా క్యారేజి తెచ్చుకో లేకపోతే అందరూ కొంచెంకొంచెం తీసి ఆమెకు పెడతారు. ఒకరి పచ్చళ్ళు ఒకళ్లు ఇచ్చిపుచ్చుకుంటూ తింటారు. క్యారేజి సర్దుకొని పూలు ఒళ్లో పోసుకుని అల్లడం మొదలవుతుంది. చేతులు వాటి పని అవి చేసుకుని పోతూనే ఉంటాయి. వాళ్ళు మాట్లాడుకోని విషయాలు ఉండవు.

వాళ్ళలో మరియమ్మ పాత సినిమా పాటలు చాలా బాగా పాడుతుంది. అందరూ అల్లుకుంటూ ఆమె చేత రోజూ నాలుగు పాటలు పాడించుకుంటారు. ఎంత శ్రావ్యంగా పాడుతుందో. ఎక్కడ నేర్చుకున్నావు మరియమ్మా అంటే చిన్నప్పుడు రేడియోలో విని నేర్చుకున్నాను అని చెప్పేది. అదే ఆమెకు సంగీతం నేర్పిస్తే పి. సుశీల స్థాయికి చేరి ఉండేది అని అంటే ముఖం సిగ్గుమొగ్గ అయ్యేది.

మధ్య మధ్యలో ఇకయికలు, పకపకలు, నీవు ఎన్ని మూరలు కట్టావు అని పందెం వేసుకొని మాలలు కడుతూనే ఉండేవారు. కుర్ర బ్యాచి ముసలి బ్యాచిని ఆటపట్టిస్తూ ఉండేవి. క్రిందటి రోజు ఎంత బేరం జరిగిందని ఒకరికి ఒకరు చెప్పుకునేవారు. ఒకోసారి వారి మధ్యలో కొట్లాటలు జరిగేవి. ఒకరిని ఒకరు మోసం చేసుకున్నామని తిట్టుకునేవారు. నా బజారులోకి వచ్చి నీవు బేరం ఎందుకు చేశావని ఒక్కోసారి జుట్టు పట్టుకునేవారు. అయినా మరునటి రోజు మామూలుగా ఉంటారు. మళ్ళీ అందరూ కలసి తినటం మాలలు కట్టుకొనటం సరిపోతుంది. అలా మధ్యాహ్నానికి నెల్లూరు చేరేవారు.

అక్కడ ఇంటి ఇంటికి పోయి పూలు అమ్ముకుంటారు. రోజు వెళ్ళేటప్పుడు పోయి అమ్ము కునేటప్పుడు ఎవరు అన్నం తింటావా అని పెడితే అక్కడే తినేవారు. ఒక్కో అమ్మ అలవాటుగా రోజూ పూలు అమ్ముతారని దయతలచి మిగిలిపోయినవి

ఏమన్నా పెట్టటం, పండగో, పబ్బమో ఇతరత్రా ఏమయినా జరిగినప్పుడు ఏదన్నా చేతిలో పెడితే తిని ఉంటారు. ఏమీ దొరకని రోజు రోడ్డు మీద, బండిమీద రెండు ఇడ్లీ తిని, చాయ్ తాగుతారు.

రాత్రి 9 గంటల బండికి బయలుదేరి చీరాల వచ్చేటప్పటికి రాత్రి ఒంటిగంట అవుతుంది. ఆ ఝామున ఇంటికి పోయి నిద్రపోవటంతో ఆ రోజు గడిచి, మరుసటి రోజు మొదలవుతుంది. అంతే వారికి పండగలు, పబ్బాలు అసలు వుండవు.

అసలు పండుగ, పబ్బాలు వస్తే మంచి బేరాలు జరుగుతాయని ఎక్కువ పూలు తీసుకొనివెళ్ళి అమ్ముకుంటారు. సెలవులు అసలు ఉండవు. రోగం వచ్చినా, రొష్టు వచ్చినా రోజు చాకిరి తప్పదు. ఇంత కష్టపడుతుంటేనే ఒక్కపూట గడవటం కష్టంగా ఉంటుంది. రోజూ పూలు అమ్ముకుని యింటికి చేరే లోపు ఎన్ని యిబ్బందులు పడాలి. ఒంటికి పోవాలన్నా, దొడ్లోకి పోవాలన్నా కుదరదు. సిగ్గు విడిచి ఏ వీధి చివరనో పని కానించుకొని పోవటం తప్ప గత్యంతరం ఉండదు.

పోకిరి మగాళ్ళు ఓ కన్ను వేసి చూస్తూనే ఉంటారు. అలాంటి బాధలు తప్పించుకొని బయటపడినా ఇంట్లో మొగుడికి అప్పుడప్పుడు అనుమానం వచ్చినప్పుడల్లా నరకం చూపిస్తాడు. ఇన్ని బాధలు పడినా ఒక్కరోజన్నా తలారా స్నానం చేసి, కొత్తబట్టలు కట్టుకొని, తలనిండా పూలు పెట్టుకొని ఏ పండగన్నా చేసుకునే అదృష్టం లేదు. ఎప్పుడు సుఖపడతామోనని రోజుకు ఒక్కసారన్నా నాతో చెప్పుకొని బాధపడతారు. వాళ్ళబ్రతుకులను నేను ఎలాగు మార్చలేను కదా! ఇలా వాళ్లు చెప్పే మాటలు అన్నీ వింటే కాని తృప్తిగా ఉండదని రోజూ వారితో కలసి మాట్లాడటం అలవాటయింది.

చీరాల రానే వచ్చింది. ఇంటికి వెళదామని అనిపించినా మనస్సు ఊరుకోలేదు. వీళ్ళు ఎందుకు రాలేదా అని మనస్సు పదే పదే ఆలోచిస్తూనే ఉంది. ఎందుకయినా ఒకసారి అనుమానం తీర్చుకుందామని వాళ్ళు ఎప్పుడూ చాయ్ త్రాగే బడ్డీ కొట్లో అతన్ని అడిగాను. అతను చెప్పిన మాటలు విని మూర్ఛ వచ్చినంత పనయింది. మరియమ్మ తెల్లవారు ఝామున పూలకని తోటకు బయలుదేరి దారి మధ్యలో చనిపోయిందని చెప్పాడు.

ఇక మనస్సు ఊరుకోలేదు. మరియమ్మ అడ్రసు కనుక్కొని ఇంటికి చేరాను. అక్కడ ఉన్న అందరూ నన్ను చూసి ఘొల్లుమని పట్టుకొని ఏడ్చారు.

"అమ్మగారూ! మీరు వస్తారని అసలు అనుకోలేదు. చూడండి అమ్మగారు మరియమ్మ చనిపోయింది. రండి అమ్మగారు చూద్దురు గాని" అని నన్ను చేయి పట్టుకొని తీసుకొనిపోయారు.

మరియమ్మను చూడగానే నాకు దుఃఖం పొంగుకొని వచ్చింది. శవం కనబడకుండా మొత్తం పూలతో కప్పివేశారు. పూలు పక్కకుతీసి ముఖం చూడగానే మీదపడి ఏడవాలనిపించింది. ఆమె నాకు ఏమీ కాకపోయినా వెక్కివెక్కి ఏడవాలనిపించింది.

ఎంతో బాగా పాటలు పాడే మరియమ్మ చనిపోవటం ఏమిటి, చాలా ఆశ్చర్యంగా ఉంది. కొంచెం స్థిమితపడిన తరువాత అందరూ నా చుట్టూ మూగారు.

"అంతేనమ్మా! మా బతుకులు చూశారు కదా! బతికినప్పుడు పూలు పెట్టుకొని, ముస్తాబవటానికి కుదరదు. చచ్చినప్పుడు చూడమ్మా ఎంత ముస్తాబు చేస్తారో. మేము ఈరోజు అమ్మటానికి తెచ్చిన పూలన్నీ మరియమ్మకు వేశాము. చూశారా తల్లి అది ఎంత అందంగా వుందో. బ్రతికినన్ని రోజులు తలకు ఇంత చమురు రాసుకొని దువ్వుకోవటానికి మాకు కుదరదమ్మా, చచ్చినాక బోలెడు పూలు దొరుకుతాయి మాకు" అని చెప్పుకుంటూ బ్రతుకులు ఇలా పువ్వుల్లా రాలిపోవలసిందేనా! అనుకుంటూ మరియమ్మ ఎలా చనిపోయింది అని అడగ్గానే...

"మీకు తెలియనిది ఏముంది అమ్మా ఏరోజన్నా మాకు మంచి తిండి దొరికిందా పాడా, వేళాపాళాలేని తిండి. ఇల్లు, ఇల్లు, వీధి, వీధి తిరగటం, టీలు త్రాగితే ఆకలి వేయదని టీ త్రాగటం, అందుకని దానికి రోగం వచ్చింది. కిడ్నీ పాడయిందట. దానికి తెలుసు. మందులకు డబ్బులు లేవు. సంపాదించిన డబ్బులు పైసలతో సహా లెక్కకట్టి మొగుడికి ఇవ్వాలి. వాడు దానికి ముష్టి వేసినట్లు అయిదు రూపాయలు దాని ముఖాన కొడతాడు.

ఈమధ్య దానికి ఒంట్లో బాగాలేదని, రక్తం లేక బాగా ఒళ్ళు చేసింది. అది సాకు చూపించి, సంసారానికి సుఖంగా లేదని వేరేదాన్ని ఉంచుకున్నాడు. దాని కడుపుకాల మొగుడ్ని డబ్బులుకు తప్పితే వీడిని దీని ఇంటికి రానిచ్చేది కాదు. దాని కష్టం తిని బాగాలేదంటూ ఇష్టరాకు పారేసినట్లు దీన్ని వదిలి ఇంకో దాన్ని ఉంచుకున్నాడు.

అసలే బాగాలేని మనిషి, వీడు చేసిన పనికి అది బాగా బాధపడేది. ఎవ్వరికి చెప్పుకునేది కాదు. దాని బాధను కడుపులో ఉంచుకొని పైకి మంచి పాటలు పాడి మనకు హాయినిచ్చేది. దాని వృత్తి పూల వృత్తే అయినా మనస్సు పూలలాంటిది. మొగుడు ఏం చేసినా నోరు ఎత్తదు. పిల్లకాయలు పెద్ద అయి వాళ్ళు పెళ్ళిళ్లు చేసుకొని పొట్టకూటికోసం ఊరువదిలి పట్నం పోయారు. తల్లి మీద ఎంత ప్రేమ ఉన్నా వాళ్ళ సంసారాలు, వాళ్ళ బాధలు వారివి.

దీని కాలం తీరిపోయిందిలే అమ్మగారు. మీరు వచ్చారు అంతే చాలు. అయినా మీకు, మాకు ఏమి సంబంధం అమ్మగారు. మేము పూలు అమ్మకోవటానికి రైలుబండిఎక్కితే, మీరు ఉద్యోగం చేయటం కోసం బండి ఎక్కారు. మన రైలు బండి అనుబంధం మనల్ని కట్టిపడేసింది"

నేను మరియమ్మకు ఏమీ చేయలేక పోయినా ఒక్క కన్నీటి చుక్కను మాత్రం రాల్చగలిగాను. "నేనే కాదు, మీకు ఎవరు ఏమీ చేయలేరు. పూలలాంటి మీ బ్రతుకులు ఇలా రాలిపోవలసిందే. ఏది ఏమయినా మరియమ్మ గొంతు మరచిపోలేను. రేపటి నుండి మన బండిలో పాటలు ఎవరు పాడతారు" అని అనగానే "అమ్మగారు దాని మనుమరాలు దీనిలాగా బాగా పాడుతుంది. దీనికి ఈడు వచ్చింది అమ్మగారు. మరియమ్మ బేరాలు వేరేవాళ్ళకు పోకుండా రేపటి నుండి దీని మనుమరాలు మాతో వస్తానంటుంది అమ్మగారు" అని చెప్పగానే 'ఇంకో మరియమ్మను తయారు చేయకండి' అని గట్టిగా అరవాలనిపించింది. కాని అప్పటికి పూలతో నిండిన మరియమ్మను నలుగురు కలసి పైకి ఎత్తుతుంటే ఘొల్లుమన్న ఆడవాళ్ళ ఏడుపుల్లో నా మాటలు పైకి రానీయకుండా అడ్డం వడ్డాయి. రెండు కన్నీటి చుక్కలు రాల్చటం మినహా ఏమి చేయలేని నిస్సహాయత ఎవరినో ప్రశ్నిస్తున్నట్లుగా అనిపించింది.



శాంతి రజనీకాంత్ స్మారక కథా పురస్కార గ్రహీతలు శ్రీయుతులు జాతశ్రీ, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, పద్మభూషణ్ డా॥ సి. నారాయణరెడ్డి, ఆచార్య కొలకలూరి ఇనాక్, పురస్కార ప్రదాతలు శ్రీమతి విమల, డా॥ శాంతి నారాయణ